పెళ్ళి పీటలనుంచి సంసారపు సరాగాల వరకూ

# రీసెర్చి

యం. వి. బి. యస్. శర్మ

పెళ్ళి యేదో అయిందనిపించేరు. అందులో శేషను రోజులు. ఒకవేళ బాగా జరుగక పోయినా అలా అనుకోవడం తప్పు కనుక, సక్రమంగానే గడచిపోయింది అని అందరూ అనుకొన్నారు. ఆ అమ్మాయిని యెపుడో చిన్న పుడు చూచింది—పెళ్ళిలో చూస్తే యెవరన్నా యేమయినా అనుకొంటారేమోనని భయం పీక్కుతింటోంది. ఒకవంక స్నేహితుడు ఊరి వాళ్ళ పెళ్ళాలను చూస్తే తప్పుకానీ—మన పెళ్ళాలను మనం చూస్తే తప్పేమిటోయ్, అని సాగదీస్తోంటే—ఎన్నోరోజులనుంచి కంటూన్న సుఖస్వప్నాలు దగ్గరకు వస్తున్నాయ్-దగ్గరకు రావడమేమిటి—అసలు జరుగుతుంటే-కాని పెళ్ళాన్ని పలుకరించడం ఓ పెద్దప్రశ్న ఐపోయింది.

పలుకరిస్తే యెప్పుడు? ఎక్కడ ? ఏలాగు?—

చుట్టుప్రక్కలా ఎవరూ లేరు. అలాయిలా చూస్తున్నాను—చీకటిలో ఈజీచేరులో దొరవారు కూర్చున సంగతి తెలీనట్టుంది. కొంచెం గొంతు సవరించుకొనేసరికి — పసికట్టి పారిపోయింది — బసవరాజు అప్పారావు "గొంతు బొంగురు వోయెడు" అంటున్నాడు—

(ఇంతవఱకు, మా మిత్రుడి డైరీలో ఒక రోజు గడిచిన సంగతులు—ఉద్ధృతములు).

ఒకరోజు గడచిపోయింది. పత్రిక తిరగేస్తున్నా. ఏక్-దిన్-కీ-సుల్తాన్ ఫిలిం అడ్వర్టయిజ్మెంటు కనపడింది. అవును నేనుకూడ ఒక రోజు రాజుని, కాదు. ప్రతిదినమూ రాజునే.

(ఇది మరుసటిరోజు డైరిలోని-కొంతభాగము)

ఈ రోజు కాఫీ టిఫెన్లు వచ్చాయి కానీ ఆవిడ రాలేదు. కధలలోని పెళ్ళాలే నయం—సుందరోద్యానములలో—ఉప్మా కాఫీలు, బవరు క్రింద అందిస్తారు—

(మరికొన్ని పేజీలు త్రిప్పితే—మనకు గోచరించేది—కొన్ని నిదాఘకాలాలూ, కొన్ని దుర్దినాచ్ఛాదిత దుర్దినములూ గడచిపోయినవని.)

ఇంకోపుటలో.

ప్రస్తుతం ఆవిడ యొక ఆడహిట్లరు. నేను నడుస్తే తప్పు కూర్చుంటే తప్పు—ప్రతిదీ తప్పే వెధవది! పియర్సుసోపు తెమ్మనింది. నీ మొహానికి సబ్బుకూడానా ? అన్నాను; వంటయింటిలోనుంచి యక్స్-బి- (X. B) క్లాస్ ఇంజిన్ స్టీమ్ వదలినట్టుంది. "బాధా సహనమే సతీత్వము బాధా" అని రికార్డుపెట్టినాను.

(మరికొన్ని పేజీలు త్రిప్పినాను. అందులో-)

....కానీ ఈ ప్రభుత్వాలు యెన్నిరోజులు సాగుతాయ్ చెప్పండి—హిట్లరు ప్రభుత్వం అంతమయినట్టే—యీ విడ హంగామాకూడా అంత్యమయింది—అదేమిటో-నా పైన ఉన్నట్టుండి దీనికి ప్రేమ పుట్టుకొచ్చింది. కారణం ? నే నెప్పుడూ క్రాపువెంట్రుకలు ముందరపడుతోంటే చెవులు తెగిన వెధవ మల్లే-వుంటంచేత కాబోలు—

ఈరోజు సినీమాకుపోయే కండిషన్ పైన కాఫీ కాచడానికి వెళ్ళింది పాపం! దానికిమాత్రం అయ్యో అనేవాళ్ళెవరున్నారు ?

(వెనుకటి పేజీలు త్రిప్పటం మాని ముందు పేజీలు త్రిప్పసాగినాను. బహుశా అతడి పెళ్ళికి ముందు అనుకొంటా)

అవ్వదగ్గరకు వెడుతే యెప్పుడూ పెళ్ళి గొడవలే. వైశాఖంలో ముహూర్తాలు లేవు. జ్యేష్ఠంలో యెండలెక్కువ అని-ఆవిడలో యిప్పటికీ రొమాన్సు చావలేదు—నేను ఆ మాటలను విననట్లు నటించినా, అవి వింటుంటే సంతోషంగానే వుంది—

ఇంతకీ జీవితం-గడచిపోతూంది—

(డైరీ యెలా దొంగతనంగా యెత్తినానో, ఆలాగే వుంచేశాను)